క్లుప్తంగా

తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు


పాతపాటి శ్రీనివాసరాజు

కాళ్ల: రాష్ట్ర ప్రజలను మోసం చేయాలనుకున్న చంద్రబాబు కేసులో న్యాయం మే గెలిచిందని రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంత కాలం వ్యవస్థలను మేనేజ్ చేసి కేసుల నుంచి చంద్రబాబు తప్పించుకున్నారని అన్నారు. ఇంత కాలానికి పాపం పండి నేరం రుజువై చంద్రబాబు అరెస్ట్ అయ్యారని తెలిపారు. అమరావతి పేరా గ్రాఫిక్స్ చూపించి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు తగిన గుణపాఠం జరిగిందన్నారు. మేము నిప్పు అని చెప్పే లోకేశ్ బాబు కోర్టు తీర్పును కూడా తప్పు పడతావా అంటూ ప్రశ్నించారు. 14 ఏళ్లగా సీఎంగా చేసి ఎంతో అవినీతికి పాల్పడ్డారని ఎద్దేవా చేశారు. అవినీతికి పాల్పడి తప్పు చేసిన వారు ఎవరైనా తగిన మూల్యం పొందక తప్పదన్నారు. టీడీపీ నాయకులు ఇకనైనా ఆలోచించాలని హితవు పలికారు. ప్రజల పక్షాన కోర్టు తీర్పు హర్షించదగ్గదని విషయమన్నారు.

బీచ్‌లో సందర్శకుల రద్దీ


కేపీ పాలెం బీచ్‌లో సేద తీరుతున్న సందర్శకులు


మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం కొద్ది పాటి వర్షం పడినా మధ్యాహ్నం నుంచి ఎండతో పాటు ఉక్కబోతగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేళాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అపూర్వ కలయిక


మొగల్తూరు ఉన్నత పాఠశాల 1971-72 బ్యాచ్ పదో విద్యార్థులు

మొగల్తూరు: స్థానిక పెన్మెత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1971–72 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సుమారు 52 సంవత్సరాల అనంతరం అప్పటి స్నేహితులంతా కలుసుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడిన స్నేహితులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. స్నేహితులంతా అనాటి ముచ్చట్లను నెమరవేసుకుంటూ అప్పుడు విద్యనందించిన ఉపాధ్యాయులు కొద్ది మంది మాత్రమే అందుబాటులో ఉండటంతో వారిని ఘనంగా సన్మానించారు.

ముద్రగడను హింసించినప్పుడు పవన్ ఏమయ్యాడు?


కావలి నాని

నరసాపురం: స్కిల్ డెవలెప్‌మెంట్ స్కామ్ లో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విషయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అల్లాడిపోయిన విధానం బాగాలేదని నరసాపురం కాపు సంఘం నేత కావలి నాని విమర్శించారు. చంద్రబాబుకు మద్దతుగా పవన్ విజయవాడ వెళ్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో కాపు సంఘ నేత ముద్రగడ పద్మనాభంను అరెస్ట్ చేసినప్పుడు పవన్ ఎందుకు ఇంతలా స్పందించలేదని ప్రశ్నించారు. ముద్రగడ పద్మనాభాన్ని దారుణంగా హింసించి, ఆయన కుటుంబాన్ని కూడా అవమానపర్చినప్పుడు పవన్ కనీసం మాట్లాడలేదన్నారు. చంద్రబాబు అంశంలో పవన్ కల్యాణ్ ఓ జనసేన అధినేతగా కాకుండా ఓ టీడీపీ నాయకుడిగా వ్యవహరించిన తీరు చూసిన జనసైనికులు కూడా ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు.

పౌర సేవ ఇంత సులువా

- జగనన్న సురక్షలో అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు


పెన్నాడ జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు, ఎంపీపీ చంటి రాజు(ఫైల్ ఫొటో)

పాలకోడేరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు వద్దకు పాలన తీసుకొచ్చింది. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడం లక్ష్యంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తోంది. ఆ కోవలోనే తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజలనుంచి అపూర్వ ఆదరణ లభించింది. సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి సైతం అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో ప్రభుత్వ నిర్ణయంపై జేజేలు పలికారు. ఒక్కమాటలో చెప్పాలంటే పౌర సేవలు ఇంత సులువా అన్న రీతిలో వైఎస్సార్ సీపీ పాలన సాగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ప్రశంసలు

జూలై 1నుంచి 27వరకూ నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు జనన, మరణ, కుల , ఆధాయ, సీసీఆర్సీ, రేషన్ కార్డు, విభజన వంటి 11రకాల ధ్రువపత్రాలను అందజేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడు చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి పెండింగ్ లోఉన్న సమస్యలను తెలుసుకొని సత్వరం పరిష్కరించడం చాలా బాగుందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

సర్వీసు చార్జీలు లేకుండా

ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఆధాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు(కుల, నివాస, ధ్రువీకరణ పత్రాలు)మరణ ధ్రువీకరణ పత్రం, కొత్త రేషన్ కార్డు, రేషన్‌కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మెబైల్ నంబర్ అప్‌డేట్, కౌలుగుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణపత్రం, కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్లు యాడ్ చేయడం వంటి సేవలు పౌరులకు అందించారు.

సమష్టి కృషితోనే ఎక్కువ ధ్రువపత్రాలు



సమష్టి కృషి కారణంగానే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎక్కువ మందికి ధ్రువపత్రాలు అందజేయగలిగాం. మా సిబ్బంది కార్యాలయ పని సమయంలోనే కాకుండా అధనంగా పనిచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి వల్ల ఎక్కువ మందికి సేవలందించగలిగాం.

షేక్ హుస్సేన్ తహసిల్దార్ పాలకోడేరు

ధ్రువపత్రం వెంటనే అందించారు



చేయూత పథకానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాల కోసం ఎలాగా అని ఆలోచించాను. అప్పుడు వలంటీర్‌కి చెప్తే జగనన్న సురక్షలో ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేస్తే ఎలాంటి రుసుం తీసుకోకకుండానే వెంటనే అందించారు. జగనన్న సురక్ష వల్ల ప్రభుత్వ సేవలు ఇంత సులువా అనిపిస్తుంది.

సైదు శశిరేఖ లబ్ధిదారు మొగల్లు

జగనన్న సురక్షతో మేలు



జగనన్న సురక్షలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. గతంలో చాలాసార్లు దరఖాస్తు చేశాను కానీ ఇప్పుడు అంత త్వరగా కార్డు వస్తుందని అనుకోలేదు. పైసా ఖర్చు లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న జగనన్న సురక్ష వల్ల నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

రామగని కృష్ణవేణి మొగల్లు

నేడు పాలకోడేరులో గడపగడపకు మన ప్రభుత్వం

పాలకోడేరు: పాలకోడేరు గ్రామంలో సచివాలయం 2 పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆకివీడు: గణపతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక పెద్దింటి అమ్మవారి వీధిలో వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఏర్పాట్లకు రాట పాతారు. గత 18 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు 19వ ఏటా ప్రారంభించేందుకు ఏఎంసీ చైర్మన్ ఎస్కే. రసూల్ బీబీ పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దింటి అమ్మ ఆలయ ట్రస్టు సభ్యుడు కుకంట్ల దానయ్య, ఎస్కే. హుస్సేన్, కిమిడి నాగరాజు, కన్నప్ప పలువురు వీరాంజనేయ యువ జన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తణుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ పి.మణికుమార్‌పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ఈ సందర్భంగా పి.మణికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం ప్రతిరోజూ చేయాలని, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలని, పిరమిడ్ జ్ఞాన రత్నాలు, రామాయణంలో పాత్రలు, బుద్ధుని అష్టాంగ మార్గం, సంకల్ప శక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, హెచ్.చక్రపాణి, సన్నిధి ఉదయ్, కె.మోహన్, వర్రె కృష్ణవేణి, సబ్బారపు కమల తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి మందుబాబు హల్‌చల్

సాక్షి, భీమవరం: పట్టణంలోని బుధవారం మార్కెట్ కూడలిలో ఉన్న సెల్ టవర్‌ను ఆదివారం ఓ మందు బాబు ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సెల్ టవర్ ఎక్కిన వ్యక్తిని కిందకు తీసుకువచ్చారు. టవర్ ఎక్కే సమయంలో చేతికి గాయం కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి పట్టణానికి చెందిన బి.వసంతరావు అని, వివరాలు సేకరిస్తున్నామని సీఐ అడబాల శ్రీను తెలిపారు. ఇదిలా ఉండగా, మద్యం మత్తులో గతంలో అనేకసార్లు వసంతరావు సెల్ టవర్ ఎక్కాడని, దీనికి ప్రత్యేక కారణం ఏమీ లేదన్నారు.

డ్రెయిన్ శిథిలం

నరసాపురం: పట్టణంలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. మురుగు పారక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పునర్నిర్మించాల్సిన అవసరముందని స్థానికులు అంటున్నారు. అయితే మునిసిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టకడం లేదని మండిపడుతున్నారు. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లకు సంబంధించిన వాడకపు నీరంతా ఈ డ్రెయిన్ గుండానే వెళ్లాలి. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలం కావడంతో మురుగు సవ్యంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో అన్న సమారాధన


వేణుగోపాల స్వామి మందిరంలో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక బంత్రోతు వారి వీధిలోని శ్రీవేణుగోపాల స్వామి మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. మందిర 51వ వార్షికోత్సవాలను ఐదు రోజులపాటు విశేష పూజలతో నిర్వహిస్తున్నారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ స్వామి వారికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుమారు 1000 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

యజ్ఞాలతోనే లోక శాంతి


శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): పురుణాల సమయం నుంచి రుషులు లోక శాంతి, లోక కల్యాణార్థం యజ్ఞాలు నిర్వహించే వారని, ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు, అనారోగ్య పరిస్థితులు పోవాలంటే యజ్ఞాలే శరణ్యమని భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్- ప్రమీలాదేవి దంపతులు ఆదివారం సుదర్శన లక్ష్మీనారాయణ స్వామి యజ్ఞం వైభవంగా గన్నాబత్తుల వారి వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి వ్రతం 108 సార్లు, నెలకు ఒకసారి నిర్వహించి 108వ వ్రతాన్ని, దానితోపాటు సుదర్శన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యజ్ఞం ఘనంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ క్రతువుతో పాటు , చిన్నఅమిరం వృద్ధాశ్రమంలో వంద మందికి భోజనాలు, భీమవరం పట్టణంలోని అన్ని దేవాలయాల అర్చకులకు నూతన వస్త్రాలు, గన్నాబత్తుల వారి కుటుంబంలో దశాబ్దాల కాలంగా పని చేస్తున్న కార్మికులను కూడా నూతన వస్త్రాలతో సత్కరించి అన్న ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నర్సాపురం వైన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, గన్నాబత్తుల రామారావు , టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, ఉద్దరాజు రాఘవ రాజు, పాకా వెంకట సత్యనారాయణ, చినిమిల్లి వెంకటరాయుడు, గూడూరి ఉమాబాల , టీవీవీ ప్రసాద్, పుప్పాల శేషు , నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు విషయంలో ధర్మం గెలిచింది


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఆకివీడు: చంద్రబాబు విషయంలో ధర్మం గెలిచిందని, తప్పు చేస్తే శిక్ష తప్పదని, ఎంతటివారికైనా చట్టం ఒక్కటేనని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ అరెస్టు, రిమాండ్, రాజమండ్రి జైలుకు తరలించడంపై ఆదివారం స్థానిక త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు హుందాగా ప్రవర్తించాలన్నారు. సీఐడీ చేసిన ఆరోపణలు వాస్తవం కాదని కోర్టులో నిరూపించుకోవాలే తప్ప, ఆరోపణలపై ఆగ్రహాజ్వాలలు ప్రదర్శించడం అవివేకమన్నారు. సీఐడీ వద్ద కచ్చితమైన ఆరోపణలున్నందునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడం, రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. చట్టప్రకారం 14 రోజులు రిమాండ్ విధించడం, రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపడం అన్నీ చట్టప్రకారమే జరిగాయని చెప్పారు. కోర్టు విధించిన రిమాండ్‌కు బద్ధులై టీడీపీ నాయకులు సామాన్య జీవనానికి అడ్డు రావదన్ని చెప్పారు. విధ్వంసాలు సృష్టించవద్దన్నారు. రాజకీయం అంటే స్వచ్ఛతగా ఉండాలని, శాంతి భద్రతలకు భంగం కల్గనివ్వద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆధారాలున్నప్పుడు అరెస్టు చేయడం తప్పుకాదన్నారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్‌గా ఉందని ఇక్కడ రాజకీయ నాయకులు, కోర్టు కూడా స్వచ్ఛంగా ఉన్నాయని ఆయన చెప్పారు. సమావేశంలో త్రిసభ్యకమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, కౌన్సిలర్లు నిమ్మల నాగు, ఎండీ. జక్కీ, నాయకులు ఎండీ.ఆలీ, కేశిరెడ్డి దుర్గారావు, అందే రాజబాబు, కేశిరెడ్డి దిలీప్, రాజనాల పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి ఆలయ ప్రతిష్ట


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు

ఉండి: మండలంలోని పడవలరేవులో నూతనంగా నిర్మాణం చేసిన సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామి ఆలయాన్ని సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ఉదయం ఘనంగా ప్రతిష్ఠ చేశారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు,టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, వెలివర్రు, వాండ్రం, మహదేవపట్నం, పాములపర్రు తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ నాయకులు రణస్తుల వసంతరావు, బొబ్బాది శ్రీరామమూర్తి, గెద్దా రవికుమార్, రెడ్డి దుర్గారావు, పున్నాని మోహన్, అక్కాబత్తుల రామకృష్ణ, ఇజ్జాడ రామకృష్ణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రణస్తుల మహంకాళి, సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, గులిపల్లి అచ్చారావు, బొచ్చా అచ్చారావు, గలావిల్లి ధనుంజయ, దాసరి వెంకటకృష్ణ,రాయి సతీష్, మునుకోలు సింహాచలం, ముప్పలూరి శ్రీనివాస్ తదితర వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకివీడులో లయన్స్ శాశ్వత సేవలు అమోఘం


వృద్ధాశ్రమ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఆకివీడు: ఆకివీడు లయన్స్ క్లబ్ శాశ్వత సేవలు అమోఘమని ఎమ్మెల్సీ వంకా రవీంధనాథ్ చెప్పారు. స్థానిక లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో మోటుపల్లి రత్తయ్య, సూర్యావతి ఆనంద నిలయం (వృద్ధాశ్రమం) భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆకివీడులోని లయన్స్ క్లబ్‌లు శాశ్వత, క్యాలండర్ సేవల్ని అందజేయడంలో ముందంజలో ఉందని చెప్పారు. అన్ని విధాలుగా లయన్స్ ద్వారా సేవలందుకుంటున్న ఈ ప్రాంత ప్రజలు అదృష్టవంతులని చెప్పారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ ప్రతినిధుల సమావేశంలో ఆకివీడు లయన్స్ క్లబ్‌ల సేవా విశిష్టతను ప్రశంసించారని పేర్కొన్నారు. శాశ్వత సేవలు దీర్ఘకాలికంగా తరతరాలకూ అందుతాయన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, అంధత్వ నిర్మూలన, పర్యావరణం వంటి వాటితో పాటు ప్రస్తుతం వృద్ధాశ్రమం నెలకొల్పడం అభినందనీయమన్నారు. భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలు మోటుపల్లి శ్రీనివాసరావు, సుబ్బారావులను అభినందించారు. భవన నిర్మాణానికి తన వంతుగా రూ. 3 లక్షలు విరాళంను ఆయన ప్రకటించారు. దాతలు ముందుకు వచ్చి త్వరితగతిని భవనం నిర్మించి, వృద్ధులకు మంచి సేవలందిస్తారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, సీహెచ్.కృష్ణంరాజు, రీజనల్ చైర్మన్ ఆర్వీ.సూర్యనారాయణరాజు, గొంట్లా కృష్ణ, దాసరి సత్యనారాయణ, చింతలపాటి సీతారామరాజు, గమిని సురేష్, మోరా జ్యోతిరెడ్డి, ఎండీ.జక్కీ, కాకర్ల రాజేశరి, నాగమణి, గొంట్లా సత్యనారాయణ, జుంగా దాసు, సన్నిధి రామవెంకటేశ్వరరావు, పలువురు లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


పాలమూరులో దగ్ధమైన పూరిల్లు

పెనుమంట్ర: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం పాలమూరు అంబేడ్కర్ కాలనీలో తాటాకిల్లు దగ్ధం కావడంతో రెండు కుటుంబాలకు చెందిన నలుగురు నిరాశ్రయులయ్యారు. వివరాల్లోకి వెళ్తే కూలి పనిచేసుకుంటూ జీవించే ఇంజే ఇశ్రాయిల్, ఇంజే నాగేశ్వరరావు, తన భార్య ప్రేమకుమారి, ఇద్దరు చిన్నారులు ఒకే తాటాకింటిలో రెండు పోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం యథావిధిగా కుటుంబ సభ్యులు చర్చికి వెళ్లారు. కొద్దిసేపటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పైకప్పు నుంచి మంటలు చెలరేగాయి. విషయం గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. అత్తిలి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నష్టం అంచనా వేశారు. ముఖ్యంగా రూ.60 వేల నగదుతో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

రోగి చికిత్సకు సాయం


జీసస్ హోప్ ఛారిటీ విరాళాన్ని రోగికి అందజేస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: పేదలకు సహాయం చేయడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన గృహంలో దొండపేటకు చెందిన తాడి నవీన్ మోటార్ సైకిల్ నుంచి పడిపోవడంతో ముక్కుకి తీవ్రగాయాలు కావడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంతో బాధపడుతున్న నవీన్‌కు జీసస్ హోప్ ఛారిటీ (కువైట్-ఇండియా) రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆనందప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసస్ హోప్ ఛారిటీ సభ్యులు జాలెం శ్రీను, నక్కా సాగర్, పాస్టర్ మెతు సలా, యాళంగి శేషగిరిరావు, నక్కా ఇర్మియారాజు పాల్గొన్నారు.

చంద్రబాబుకి రిమాండ్‌పై హర్షం..

స్కిల్ దవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబుకి న్యాయమూర్తి రిమాండ్ విధించడంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ స్కామ్ నుంచి బయటపడడానికి చంద్రబాబు చాలా ప్రయత్నం చేశారని, న్యూఢిల్లీ నుంచి లాయర్లను రప్పించుకున్నారని అయినా చంద్రబాబుకి ఫలితం దక్కలేదన్నారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా చట్టం ముందు తలవంచాల్సిందేనన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


ఉచిత వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పోడూరు: నేటి సమాజంలో అందరూ ఒత్తిడితో కూడిన జీవితాన్ని ఎదుర్కొంటున్నారనీ, దీనివల్ల చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయనీ, కాబట్టి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ వేదాంతం పిలుపునిచ్చారు. జేసీఐ పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరు ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలకు తగిన వైద్యసేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా శిబిరంలో ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సూచనలు చెప్పారు. రోగులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మౌని కావలి, హెడ్ అండ్ నెక్ జర్జన్ డాక్టర్ జయదుర్గాదేవి రుద్రరాజు, ప్రసూతి వైద్యనిపుణురాలు డాక్టర్ ఉమాదేవి కావలి, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుభాషిణి జక్కంపూడి, డాక్టర్ ప్రశాంతి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ మీనా మణిదీప్తి, ట్రెజరర్ సవిత, సభ్యులు కౌసిక్, శిరీష, నీలిమ, ప్రదీప్, విష్ణు, మురళీ కృష్ణ, సుందరి పాల్గొన్నారు.